Eenadu - DT: 21.05.2014

# మెట్రో కోచ్.. వచ్చిందోచ్

## వచ్చే నెలలో టెస్ట్ రన్

**ఈనాడు, హైదరాబాద్:** నగరవాసుల కలల ప్రయాణం త్వరలోనే సాకారం కానుంది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న హైదరాబాద్ మెట్రో రైల్ మొదటి కోచ్ నగరానికి చేరుకుంది. సిటీలోని ఆకాశమార్గంలో నిర్మితమైన మార్గంలో ప్రయాణించబోయే మెట్రో కోచ్ నమూనా మాత్రమే ఇదివరకు నగరవాసులు చూశారు. నమూనా కూడా కోచ్‌లో ఒక భాగం మాత్రమే ఎల్ అండ్ టీ, హెచ్ఎంఆర్ సంస్థలు ప్రజల సందర్శనార్థం ప్రదర్శనగా ఏర్పాటు చేశాయి. ఉగాది నుంచి నాగోల్-మెట్టుగూడల మధ్య 8 కిలోమీటర్ల మార్గంలో మెట్రోరైలు మొదట ప్రయాణించనుంది. కొరియా నుంచి సముద్రమార్గంలో వారం క్రితం మెట్రో కోచ్ చెన్నై చేరుకుంది. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో పెద్ద పెద్ద కంటైనర్లలో దానిని ఇక్కడికి తరలించారు. ఈ కోచ్‌తో ఉప్పల్ డిపోలో ట్రయల్ రన్ ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఇక్కడ సుమారు టెస్ట్ ట్రాక్ పూర్తయ్యింది. టెస్ట్ ట్రాక్ 0.9 కి.మీగా ఉంటుందని మెట్రోవర్గాలు తెలిపాయి. ఇక్కడ పరీక్షించిన అనంతరం ఆకాశమార్గంలో ప్రయాణానికి అనుమతి లభిస్తుంది. అక్కడ సైతం మూడు నెలల పాటూ పరీక్షిస్తారు. ఆ తర్వాతే ప్రయాణికులను అనుమతిస్తారు. 'మెట్రో కోచ్‌లు నగర శివార్లకు చేరుకున్నాయి. అక్కడ నుంచి డిపోకు తరలించాక విడి భాగాలన్నీ కలపాల్సి ఉంటుంది. ఇందుకు సమయం పడుతుంది. కోచ్‌లు అద్భుతంగా ఉంటాయి. వచ్చే నెలలో టెస్ట్ రన్ మొదలవుతుంది' అని హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. డిపోలో పరీక్షించే కోచ్‌లో ముందు వెనక ఇంజిన్లు, మధ్యలో మూడు బోగీలు ఉంటాయి. వీటినే కార్‌గా పిలుస్తుంటారు. ఒక్కో కోచ్‌లో దాదాపుగా వెయ్యిమంది ప్రయాణించే వీలు ఉంటుంది.

**తాజా పరిస్థితి..**

- 1320 పునాదులు పూర్తయ్యాయి. వీటి పరిధి దాదాపు 34 కిమీ. ఉంటుంది.
- 1186 స్తంభాలు నిర్మించారు. ఇవి 31 కి.మీ. మేర విస్తరించి ఉన్నాయి.
- రెండు స్తంభాల మధ్య స్పాన్‌ల బిగింపు 21 కి.మీ. మేర పూర్తయింది. 844 స్పాన్‌లు బిగించారు.